క్లుప్తంగా

బీజేపీ గెలుపును అడ్డుకోలేరు..

మరికల్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపును ఎవరూ అడ్డుకోలేరని బీజేపీ నాయకులు వేణు, రమేష్ అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చేసే మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, ఆ రెండు పార్టీలకు ఓట్లు వేస్తే సముద్రంలో వేసినట్లేనని విమర్శించారు. మహబూబ్‌నగర్ ఎంపీ స్థానం నుంచి పోటీచేస్తున్న డీకే అరుణ విజయం ఖాయమని వారు దీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు ప్రజలు చూస్తున్నారని గుర్తు చేశారు.

మండల ఇన్‌చార్జిల నియామకం

నారాయణపేట రూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నారాయణపేట నియోజకవర్గంలో బీజేపీ మండల బాధ్యుల నియామకం చేపట్టింది. రాష్ట్ర నాయకులు రతంగపాండురెడ్డి, జిల్లా ఇన్‌చార్జి సదానందగౌడ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పీ. శ్రీనివాసులు, రఘురామయ్యగౌడ్ మండల ఇన్‌చార్జిల పేర్లను గురువారం ప్రకటించారు. మరికల్ నర్సన్‌గౌడ్, ధన్వాడ సుంకు ఉమేష్, కోయిలకొండ, చెన్నారెడ్డి, దామరగిద్ద సత్యాయాదవ్, నారాయణపేట కెంచె శ్రీనివాస్, టౌన్ రఘుపాల్‌రెడ్డిలను నియమించారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

నారాయణపేట రూరల్: జాతీయ ఉపాధిహామీలో పనిచేస్తున్న కూలీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు వెంకట్రాములు డిమాండ్ చేశారు. మండలంలోని అప్పిరెడ్డిపల్లి, అమ్మిరెడ్డిపల్లి గ్రామాల్లో గురువారం పర్యటించారు. ఉపాధిపనులు కొనసాగుతున్న ప్రాంతాలకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ 200రోజులు పని కల్పించాలని, రోజువారి కూలీని రూ.600కి పెంచాలని డిమాండ్ చేశారు. వేసవిలో ఎండలు మండిపోతున్న కనీస సౌకర్యాలు కల్పించలేదని, నీడ కోసం టెంట్లు, తాగునీరు అందించాలన్నారు.

ఒండ్రుమట్టి టిప్పర్ల రాకతో రైతుల ఆందోళన

మరికల్: ఇటుక బట్టీలకు టిప్పర్ల ద్వారా ఒండ్రుమట్టి తరలించడంపై రైతులు గురువారం ఆందోళన వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నం రోడ్డు పక్కన ఉన్న ఇటుక బట్టి యాజమాన్యులు మట్టిరోడ్డుపై నీళ్లపోయకుండా టిప్పర్లను నడిపించడంతో పక్కనే ఉన్న పశుగ్రాసంపై దుమ్ము, దూళి పడటంతో పశువులు గడ్డి మేయడం లేదని టిప్పర్లను అడ్డుకున్నారు. ఈ విషయంపై అధికారులు స్పందించి గ్రామానికి దగ్గరగా ఉన్న ఇటుక బట్టిని ఇక్కడి నుంచి తొలగించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఘనంగా సిగ్నేచర్ డే

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం సిగ్నేచర్ డేను ఘనంగా నిర్వహించారు. ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ జీవితం అనుభవాలతో కూడుకున్నదని, విద్యతో పాటు విద్యార్థులు నైతిక విలువలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగలక్ష్మి, వాసంతి, రామేశ్వరి, తస్లిమ, యాదయ్య ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమకట్టడాలను అడ్డుకట్ట వేయండి

మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ అర్బన్ మండలం క్రిస్టియన్‌పల్లి రెవెన్యూ గ్రామ శివారులో దివ్యాంగులకు కేటాయించిన స్థలాల్లో అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట వేయాలని ఆర్డీఓ నవీన్‌ను ఉదయ్ అసోసియేషన్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ దివ్యాంగులకు స్థలాలను కబ్జా చేసి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నా, రెవెన్యూ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. స్థలాలను ఆక్రమించుకోవడమే కాకుండా స్థలాలపై బోగస్ పట్టాలు సృష్టించి నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. ఈ విషయమై అర్బన్ మండల తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు కలిసి తమ గోడు వెల్లబోసుకున్నా మీనామేషాలు లెక్కిస్తున్నారే తప్ప ప్రభుత్వ స్థలాలను కాపాడేందుకు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదన్నారు.

ఈదురు గాలుల బీభత్సం

మరికల్: ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో మండలంలో భారీ వృక్షాలు నేలకొరిగాయి. గురువారం రాత్రి వచ్చిన భారీ గాలులకు నారాయణపేట, రాయిచూర్ రోడ్లపైనే కాకుండా గ్రామీణ రహదారులపై భారీ వృక్షాలు నెలకొరిగాయి. అప్పంపల్లి, మందిపల్లి వద్ద భారీ వృక్షాలు నారాయణపేటకు వెళ్లేరోడ్డుపై కూలడంతో రెండు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రెండు గంటల తర్వాత జేసీబీ సాయంతో చెట్లను తొలగించిన అనంతరం పోలీసులు ట్రాఫిక్ నియంత్రించారు.



వైద్యం.. దయనీయం

- 24 గంటల పీహెచ్‌సీలో వైద్యులు కరువు
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- అన్నీ తామై వైద్యం అందిస్తున్న ఏఎన్ఎంలు



దామరగిద్ద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

దామరగిద్ద: మారుమూల మండలం దామరగిద్ద పీహెచ్‌సీలో పేదల వైద్యం దయనీయంగా మారింది. సదుపాయాలున్న వైద్యులు లేక దేవుడు వరమిచ్చినా.. పూజారి కరుణించలేదన్న చందంగా మారింది. దామరగిద్ద ఆరోగ్యం కేంద్రం పరిస్థితి. తాత్కాలిక వైద్యులతో కాలం వెళ్లదీస్తున్న పీహెచ్‌సీలో విధులు నిర్వహించే వైద్యులు ఉన్నత చదువులు, లేదా డిప్యుటేషన్, బదిలీ తదితర కారణాలతో వేరే ప్రాంతాలకు వెళ్లడంతో ఇక్కడి పేదలు వైద్యానికి నోచుకోని దుస్థితి నెలకొంది. దామరగిద్దలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మూడు నెలల క్రితం 24గంటల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. కేవలం స్టాఫ్‌నర్స్‌లను కేటాయించి రాత్రి, పగలు ఆస్పత్రిని నడిపించడం తప్ప ఎలాంటి వైద్య సదుపాయాలు కల్పించలేదు. దీంతో పేరుకే 24గంటల ఆస్పత్రి తప్ప రోగులకు సేవలందించే వైద్యులే లేని ఆస్పత్రిగా మారడంతో పేదల వైద్యానికి భరోసా కరువై ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్న దుస్థితి నెలకొంది.

వైద్యాధికారి పోస్టు ఖాళీ..

కొంతకాలంగా కాంట్రాక్ట్ పద్ధతితో పనిచేస్తున్న వైద్యురాలు స్ఫూర్తి ఉన్నత చదువుల కోసం దీర్ఘకాలిక సెలవు పెట్టి వెళ్లడంతో ఉన్న వైద్యురాలి పోస్టు సైతం ఖాళీ అయింది. వాస్తవానికి 24గంటలు సేవలందించే ఆస్పత్రిలో ఇద్దరు వైద్యులు ఉండాలి. ఇద్దరు ఏఎన్ఎంలు, ఇద్దరు ఆయాలు, ఆయా విభాగాలకు తగినంత సిబ్బందిని నియమించాలి. గతంలో పనిచేస్తున్న ఎన్‌సీడీ (నేషనల్ కమ్యూనికేబుల్ డిసీజ్ పోగ్రాం) స్టాఫ్‌నర్స్ సైతం ఇటీవల చేపట్టిన ఏఎన్ఎం పోస్టుకు ఎంపికై విధులకు వెళ్లడంతో ఎన్‌సీడీ పోస్టు సైతం ఖాళీ అయింది. మండలంలోని సుజనాపూర్, వత్తుగుండ్ల, సబ్‌సెంటర్లలో నియమించిన ఇద్దరు వైద్యులను జిల్లాకేంద్రంలోని ఆస్పత్రికి డిప్యుటేషన్‌పై పంపించగా మొగుల్‌మడ్క సబ్‌సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న వైద్యురాలిని మద్దూర్‌కు కేటాయించడంతో పల్లె దవాఖానాల్లో సైతం వైద్యులు లేని దుస్థితి నెలకొంది.



మొగుల్‌మడ్కలో వైద్యులు లేని పల్లె దవాఖానా

డిప్యుటేషన్‌లో ల్యాబ్ టెక్నీషియన్

ఆస్పత్రిలో విధులు నిర్వహించాల్సిన ల్యాబ్‌టెక్నీషియన్‌ను ఉన్నతాధికారుల ఆదేశాలతో డిప్యుటేషన్‌పై మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ టెస్టింగ్ హబ్‌కు వెళ్లాడు. దీంతో ఇక్కడికి వచ్చిన రోగులు పరీక్షలు చేపట్టే వారు కరువయ్యారు. ఆస్పత్రికి వచ్చిన రోగులు ఎలాంటి పరీక్షలు నిర్వహించకపోవడంతో బీపీ, షుగర్, ఫీవర్ తదితర పరీక్షలకు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి వెళ్తున్నారు. అయితే పేట ఆస్పత్రికి వెళ్లిన రోగులను దామరగిద్దలోనే చూయించుకోవాలని తిప్పి పంపిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

వైద్యులను నియమించాలి..



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 24గంటల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసిన వైద్యసదుపాయాలు పెరగడం లేదు. పేదలు సరైన వైద్యానికి నోచుకోవడం లేదు. తాత్కాలిక పద్ధతిలో విధులకు వస్తున్న వైద్యులు ఏడాది తిరగకుండానే వివిధ కారణాలతో వెళ్లిపోతున్నారు. ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు విన్నవించిన తీరు మారడం లేదు. అధికారులు స్పందించి వైద్యులను నియమించాలి. – నర్సప్ప, ఎంపీపీ, దామరగిద్ద

ఎంఎల్ఎస్‌పీ వైద్యులతో సేవలు..

పీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్యురాలు ఉన్నత చదువులకోసం సెలవులో వెళ్లడంతో వైద్యురాలి పోస్టు ఖాళీ అయింది. ప్రత్యామ్నాయంగా కాన్‌కుర్తి సబ్‌సెంటర్ నుంచి ఎంఎల్ఎస్‌పీ వైద్యురాలిని పీహెచ్‌సీకి కేటాయించి వైద్యసేవలు అందిస్తున్నాం. ఎంబీబీఎస్ వైద్యుల కొరత ఉంది. పేట జిల్లాకు చెందిన టీహబ్ మహబూబ్‌నగర్‌లో ఉన్నందున అక్కడ విధులకు ఎల్‌టీని పంపించిన మాట వాస్తవమే. మరి కొద్ది రోజుల్లో ల్యాబ్ టెక్నీషియన్‌ను దామరగిద్దలోనే పూర్తిస్థాయిలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటాం. – సౌభాగ్యలక్ష్మి, డీఎంహెచ్‌ఓ, నారాయణపేట

‘నిలువురాళ్లు’ విద్యామాస పత్రిక విడుదల



మాసపత్రికను విడుదల చేస్తున్న నోడల్ అధికారి వెంకటయ్య

మాగనూర్: నిలువురాళ్లు ఏప్రిల్ మాసపు సంచికను గురువారం మండల విద్యా వనరుల కేంద్రం వద్ద నోడల్ అధికారి వెంకటయ్య చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సంచిక పాఠశాల అభివృద్ధి, బాల, బాలికల యొక్క మానసిక వికాసంకోసం అంశాలు, పాఠశాలలో కొనసాగుతున్నటువంటి ముఖ్యమైన దినోత్సవాలు, సులభతరమైనటువంటి బోధన వ్యూహాలు, ఉత్తమ ఫలితాల పాఠశాల వివరాలు తదితర అంశాలను పొందుపరిచి ప్రతినెల ఈ మాసపత్రికను పాఠశాలకు చేరవేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌పీ నరేందర్, హెచ్ఎం నర్సింహారెడ్డి, బలరాం, సాయిబాబా, దీప, స్వప్న, విశాలాక్షి, శశిరేఖ, సీఆర్‌పీ ఎల్లాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథోత్సవం



ధన్వాడ: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం తెల్లవారుజామున రథోత్సం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున భక్తులు రథాన్ని లాగారు. అనంతరం స్వామివారి అభిషేకం, విష్ణు సహస్రనామ పారాయణం, స్వామివారి సర్వదర్శనం నిర్వహించనున్నారు. స్వామివారి సర్వదర్శనం, పల్లకిసేవ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఉపాధి పనుల వద్ద సౌకర్యాలు కల్పించాలి

మరికల్: వేసవి సందర్భంగా ఉపాధి పనులు జరిగే ప్రాంతాల్లో కూలీలకు కనీస వసతులు కల్పించాలని పంచాయతీ శాఖ స్పెషల్ కమిషనర్ షఫీ ఉల్లా అన్నారు. మండలంలోని రాకొండలో గురువారం ఆయన ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఉపాధి పథకం కింద కొనసాగుతున్న పనుల వివరాలు సేకరించారు. కూలీలకు రోజువారీగా పడుతున్న వేతనం అడిగి తెలుసుకున్నారు. కూలీలకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం డంపింగ్‌యార్డులో తడిపొడి చెత్తను వేరుచేసి ఎరువులు తయారు చేయాలని సూచించారు. వర్షాకాలంలో నాటే మొక్కలకు ప్రదేశాలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ రాజేశ్వరీ, జెడ్పీసీఈఓ జ్యోతి, ఎంపీడీఓ పావని, కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న స్పెషల్ కమిషనర్

అధ్వానంగా రోడ్డు



మాగనూర్: మండల పరిధిలోని ఉజ్జెల్లి నుంచి బైరంపల్లి వరకు ఉన్న మట్టిరోడ్డు గుంతలు, కంపచెట్లతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దాదాపుగా మూడు కిలో మీటర్ల రోడ్డు గుంతల మయంగా మారింది. దీంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అక్రమ మద్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు

మద్దూరు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మద్దూరు నుంచి జాదరావుపల్లి గ్రామానికి చెందిన వెంకటప్ప బైక్‌పై అక్రమంగా 5.4 లీటర్ల మద్యం బాటిళ్లను గురువారం సొంత గ్రామానికి తీసుకెళ్తుండగా మద్దూరు శివారులో అతడిని పట్టుకొని మద్యాన్ని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. వీటి విలువ సుమారుగా రూ.5,940 ఉంటుందన్నారు. ఆయనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాంలాల్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అక్రమ మద్యం, నగదుగాని, ఇతర విలువైన వస్తువులు రవాణా చేయొద్దని తెలిపారు.

మక్తల్: మక్తల్ నుంచి గుడిగండ్ల గ్రామానికి చెందిన కటికే ఫయాజ్ బైక్‌పై అక్రమంగా 9.77 లీటర్ల మద్యం బాటిళ్లను సొంతగ్రామానికి తీసుకెళ్తుండగా అతడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. అదేవిధంగా మక్తల్ నుంచి బోందల్‌కుంటకు చెందిన లక్ష్మణ్ బైక్‌పై అక్రమంగా 25.74 లీటర్ల మద్యం బాటిళ్లను తీసుకెళ్తుండగా పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. వీటి విలువ సమారుగా రూ. 20.610 ఉంటుందని ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు.

తాగునీటి ఎద్దడిని పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి

ఆత్మకూర్: వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి, మండల ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సుజాత, తహసీల్దార్ రాజు, ఏఓ వినయ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు రామకృష్ణ, రుక్మేందర్‌రెడ్డి, గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి అవసరాలను గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టే విధంగా ముందుకెళ్లాలని సూచించారు.

నామినేషన్‌కు తరలిన బీజేపీ కార్యకర్తలు



మహబూబ్‌నగర్‌కు తరలివెళ్తున్న నాయకులు



ఊట్కూర్ నుంచి..

నారాయణపేట రూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తొలిరోజు నామినేషన్ వేస్తున్న బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు మద్దతుగా గురువారం జిల్లా నుంచి పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు మహబూబ్‌నగర్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణలో 10కిపైగా సీట్లు కమలం పార్టీ గెలుస్తుందని, కేంద్రంలో మూడోసారి మోదీ ప్రధానిగా హ్యాట్రిక్ సాధించబోతున్నారన్నారు. కార్యక్రమంలో నాగురావునామాజీ, లక్ష్మి, కృష్ణ, నందునామాజీ, వెంకటయ్య, రాము, వివిధ మండల అధ్యక్షులు, కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఊట్కూరు: మహబూబ్‌నగర్ పట్టణంలోని గురువారం బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ నామినేషన్ వేసేందుకు మద్దతుగా మండలం నుంచి బీజేపీ కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. ఈ మేరకు.. జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి బీజేపీపార్టీ విజయంకోసం కృషిచేయాలని కోరారు. మండల అధ్యక్షుడు రమేష్, ఎంపీటీసీ హన్మంతు, వెంకటరాములు, రమేష్, భరత్, రాజారెడ్డి తరలివెళ్లారు.

తప్పుడు నివేదికలిస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీ హర్ష

నారాయణపేట: తప్పుడు నివేదికలు, లెక్కలు చూపితే శాఖపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ కోయ శ్రీ హర్ష పంచాయతీ కార్యదర్శులను హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆయా మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు.. మండలంలోని అభంగాపూర్, బండగొండ, లక్ష్మీపూర్, ఎక్లాస్‌పూర్, శాసన్‌పల్లి, చిన్నజట్రం, కొల్లంపల్లి పంచాయతీ కార్యదర్శులు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన(డీఎస్ఆర్) డైలీ శానిటేషన్ రిపోర్ట్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 5:30 నుంచి 7:30 వరకు తమ గ్రామ పంచాయతీలకు వెళ్లి శానిటేషన్‌ను పరిశీలించినట్లు కార్యదర్శులు రిపోర్ట్ ఇస్తే నమ్మడానికి ఎవరూ సిద్ధంగా లేరని, మీ పంచాయతీలకు వెళ్లకుండా డీఎస్ఆర్ ఎలా ఎంట్రీ చేశారని ఆయా పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ నిలదీశారు. ఆ గ్రామాల్లోనే కాకుండా మండలంలోని మిగతా గ్రామాల్లోనూ కార్యదర్శులు క్షేత్రస్థాయికి వెళ్లకుండానే రిపోర్ట్ ఇవ్వడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. గురువారం ఇచ్చిన డీఎస్ఆర్ టైమ్ ప్రకారమే శుక్రవారం ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయికెళ్లి ఏ ఏ పనులు పరిశీలించారనేది ఫొటోలు తీసి తనకు పంపించాలని, అలా పంపించని కార్యదర్శుల ఇంక్రిమెంట్ కట్‌చేయాలని కలెక్టర్ డీఎల్‌పీఓను ఆదేశించారు. ఒక్క డీఎస్ఆర్ కాకుండా కార్యదర్శులు ఇష్టానుసారంగా పంచాయతీ నిధులు డ్రా చేసుకుంటున్నారని, ఆయా నిధుల వినియోగానికి సంబంధించిన ఆడిట్‌ను స్వయంగా తానే పరిశీలిస్తానని కలెక్టర్ డీఎల్‌పీఓకు చెప్పారు. ఇకపై తప్పుడు లెక్కలతో నిధులు డ్రా చేసినా, డీఎస్ఆర్ నమోదుచేసిన కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్, డీఆర్‌డీఓ రాజేశ్వరి, డీఎల్‌పీఓ సుధాకర్‌రెడ్డి, ఎంపీఓ, ఆయా మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి రథోత్సవం



రథోత్సవంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

కృష్ణా: మండలంలోని కున్సిలో వేణుగోపాలస్వామి రథోత్సవాన్ని గురువారం తెల్లవారుజామున వేదపండితుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకరణ, పల్లకి సేవ కార్యక్రమాలు నిర్వహించారు. రథోత్సవంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరై పూజలు చేశారు. ఈ ఉత్సవాలకు వేలాదిమంది భక్తులు హాజరై తమ మొక్కులు తీర్చుకున్నారు.

జల సంరక్షణలో భాగస్వాములవుదాం



జల సంరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది

కోస్గి: నీటిని వృథా చేయకుండా అవసరమైనంత వరకు వినియోగించుకుంటూ జల సంరక్షణలో అందరం భాగస్వాములవుదామని మున్సిపల్ కమిషనర్ శశిధర్ అన్నారు. ఈ మేరకు గురువారం వాక్ ఫర్ వాటర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జల సంరక్షణపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి లభ్యత, ప్రాముఖ్యత, సంరక్షణ విధానం తెలుసుకొని తమ కుటుంబ సభ్యులకు, చుట్టు పక్కల వారికి వివరించాలన్నారు. నీటి సంరక్షణపై అవగాహన లేకపోవడంతో నేడు ప్రధాన పట్టణాలు తాగునీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా వాక్ ఫర్ వాటర్ స్వచ్ఛంద సంస్థ వలంటీర్ వీరు మల్లేష్ ప్రతిరోజు వాడే నీటిని ఏ విధంగా సంరక్షించుకోవాలనే పలు అంశాలను వివరించారు. ఇదే క్రమంలో మండల పరిధిలోని బొల్వోన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో సైతం విద్యార్థులకు అవగాహన కల్పించి నీటి భద్రతపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కోడిగంటి అన్నపూర్ణ, మేనేజర్ శంకర్ నాయక్, పుర సిబ్బంది, హెచ్ఎం నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

నీటిని వృథా చేయొద్దు..

మద్దూరు: ప్రతి ఒక్కరూ నీటిని అవసరాల మేరకే వాడుకోవాలని, నీటిని వృథా చేయడంతో తీవ్ర అనార్థాలు ఏర్పడుతాయని పెదిరిపాడ్ జెడ్పీ ఉన్నతపాఠశాల హెచ్ఎం బాలకిష్టప్ప విద్యార్థులకు సూచించారు. గురువారం పాఠశాల ఆవరణలో' వాట్ ఫర్ వాటర్ ఫౌండేషన్' వారి అభ్యర్థన మేరకు విద్యార్థులకు నీటి ప్రతిజ్ఞ చేయించారు. నీటి లభ్యత, వినియోగం, సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సవిత, మురళీధర్, లక్ష్మిబాయి, విజయ, సంధ్యారాణి, బాలరాజ్, ఉమ, మల్లిక, వెంకట్‌రెడ్డి, ఆనందమ్మ తదితరులు పాల్గొన్నారు.



పెదిరిపాడ్‌లో నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

రహస్యంగా బెల్టు దుకాణాలకు మద్యం

మరికల్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో గ్రామాల్లోని బెల్టు దుకాణాలకు మద్యం విక్రయించకూడదనే నిబంధనలను వైన్స్ యాజమాన్యులు తుంగలో తొక్కుతు రహస్యంగా తరలిస్తున్నారు. గ్రామాలకు మద్యం తరలించకుండా రహదారుల వెంబడి పోలీసులు గట్టి నిఘా వ్యవస్థను ఏర్పాటుచేయడంతో బైక్‌లపై, ఇతర వాహనలపై తరలిస్తున్న మద్యాన్ని పోలీసుల తనిఖీలో పట్టుబడతున్నాయి. మద్యం పోలీసులకు చిక్కకుండా వైన్స్ యాజమాన్యులు వారి సిబ్బందితో పోలీసులను కనిపెడుతు రహస్యంగా బెల్టు దుకాణాలకు చేరవేస్తున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు, పోలీసులు వైన్స్ దుకాణాల యాజమాన్యంపై చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికల కోడ్ నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలింపునకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సినా అవసరం ఎంతైన ఉంది.

పెట్రోల్ బంకుల వద్ద అప్రమత్తత అవసరం



పెట్రోల్ బంకు సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆత్మకూర్: పెట్రోల్ బంకుల వద్ద వినియోగదారులు, సిబ్బంది తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని, ధూమపానం చేయకుండా చర్యలు తీసుకోవాలని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక పెట్రోల్ బంకుల వద్ద అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సిబ్బంది విన్యాసాలు ప్రదర్శించడంతో పాటు అవగాహన కల్పించారు. ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విన్యాసాలతో క్లుప్తంగా వివరించారు. రెండు రోజుల పాటు ప్రధాన కూడళ్లు, గ్రామాల్లో ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం వారోత్సవాల కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది సంజీవరెడ్డి, రాముడు, సందీప్ రెడ్డి, భానుచందర్‌రెడ్డి, వెంకటనర్సయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలి

మాగనూర్: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని ఎస్‌ఐ ఎండీ అబ్దుల్ ఖాదర్ సూచించారు. గురువారం మండలంలోని సమస్యాత్మక గ్రామాలైనా అమ్మపల్లి, అడవిసత్యారం గ్రామాల్లో కేంద్రసాయుధ పోలీస్ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ.. ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటుహక్కును వినియోగించుకోవడానికే ఈ కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎన్నికలపై అభద్రతభావం లేకుండా భరోసాకల్పిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఎండీ అబ్దుల్ ఖాదర్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అమ్మపల్లిలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు